క్లుప్తంగా

17న మూర్ఛరోగుల ప్రత్యేక క్లినిక్

నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూర్ఛ రోగుల కోసం ఈనెల 17న ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం వరకు ఉచిత ప్రత్యేక క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆస్పత్రిలో డాక్టర్లతో కలిసి ఆవిష్కరించారు.

విద్యార్థి మృతిపై విచారణ చేయించండి

నెల్లూరు (టౌన్): నారాయణలో బీడీఎస్ విద్యార్థి ప్రదీప్ మృతిపై సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలుసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రకేసరి జయంతికి ఏర్పాట్లు చేయాలి

నెల్లూరు(బృందావనం): నగరంలో ఏసీ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఈ నెల 23వ తేదీన జరుగనున్న జయంతికి సంబంధించి తగు ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు గురువారం విజ్ఞప్తి చేసినట్లు మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ తెలిపారు. తక్షణమే ఆంధ్రకేసరి విగ్రహానికి రంగులువేసి బాగుచేయాలన్నారు. మిత్రుల సహకారంతో జనవరి నాటికి కాంస్య విగ్రహం ప్రతిష్టించేందుకు కృషిచేస్తామన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబు



ముస్తాబైన కలెక్టరేట్

నెల్లూరు(దర్గామిట్ట): స్వాతంత్య్ర దిన వేడుకలను పురస్కరించుకుని నెల్లూరులో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టరేట్‌ను మూడు రంగుల విద్యుత్‌లైట్లతో శోభాయమానంగా అలంకరించారు.

వీఓఏ తొలగింపుపై మహిళల ధర్నా

- వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



ధర్నా చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

పొదలకూరు : మండలంలోని బిరదవోలు పొదుపు సంఘాల వీఓఏగా గత 23 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వెన్నపూస ఆదిలక్ష్మమ్మను కారణం లేకుండా తొలగించారని పొదుపు సంఘాల సభ్యులు పొదలకూరు వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆదిలక్ష్మమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాల్సిందిగా పొదుపు మహిళలు డిమాండ్ చేశారు. బిరదవోలు, బ్రాహ్మణపల్లి, కల్యాణపురం, పార్లపల్లి గ్రామాలకు చెందిన మహిళలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా వీఓఏగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఆదిలక్ష్మమ్మను ఎలాంటి సమాచారం లేకుండా తొలగించి ఆమె స్థానంలో మరో మహిళను నియమించినట్లు తెలిపారు. ఆమె 48 పొదుపు సంఘాల లెక్కలు చూస్తూ సకాలంలో బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఆమె ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు పాల్పడలేదని ఏపీఓ, సీసీ వద్ద ఆధారాలు ఉంటే చూపాల్సిందిగా నినాదాలు చేశారు. అన్యాయంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని వీఓఏను తొలగించడాన్ని తాము సమ్మతించేది లేదని, ఆమె మాకు కావాలని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వినతిపత్రం అందజేసేందుకు కార్యాలయానికి ఏపీఎం హాజరు కాకపోవడంతో ఆమె వచ్చిన తర్వాత అందజేస్తామన్నారు. ఈ విషయంపై ఏపీఎం రోజ్‌మేరీని ఫోన్‌లో వివరణ కోరగా వీఓఏలను తొలగించడం, కొత్తవారిని నియమించడం వంటి అధికారం తమకు లేదన్నారు.

గేదెల చోరీపై ఫిర్యాదు

పొదలకూరు : మండలంలోని బిరదవోలు చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాడిరైతు తన గేదెలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రామకృష్ణ మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వర్ధినేని రామయ్యకు చెందిన నాలుగు గేదెలను గుర్తుతెలియని వ్యక్తుల చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

విడవలూరు : మండలంలోని ముదివర్తి ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌ను తరలిస్తుండగా వావిళ్ల సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రేడియేషన్‌తో పరేషాన్!

- జనవాసాల మధ్య సెల్‌టవర్ల ఏర్పాటు
- నిబంధనలు పట్టించుకోని కార్పొరేట్ సంస్థలు
- వాటి నుంచి వెలువడుతున్న రేడియేషన్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



నగరంలో పక్కపక్కనే గల భవనాలపై ఏర్పాటు చేసిన సెల్‌టవర్లు

నెల్లూరు (బారకాసు): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలందరికీ సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నారులను తప్పిస్తే ప్రతి ఒక్కరి చేతిలోనూ సెల్‌ఫోన్ దర్శనమిస్తోంది. అవసరాలకు ఫోన్ ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, దాని వల్ల కొన్ని ఇబ్బందికర పరిస్థితులు కూడా ఉన్నాయన్న విషయం గుర్తుంచుకోవాలి. సెల్‌ఫోన్లకు సిగ్నల్ అందించే టవర్ల వల్ల విపరీతమైన రేడియేషన్‌తో ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. జనావాసాల మధ్య టవర్లు ఏర్పాటు చేయడం వల్ల వాటి నుంచి విడుదలయ్యే అధిక రేడియేషన్‌తో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కొన్ని కార్పొరేట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ఏమైతే తమకేంటనే ధోరణి కొన్ని కార్పొరేట్ సంస్థల్లో కనిపిస్తోంది. తమ వ్యాపారం కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్న సంస్థలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. రేడియేషన్ పెద్ద ఎత్తున విడుదల అవుతుండడంతో గ్రామీణ ప్రాంతాలలో కొన్ని పక్షిజాతులు సైతం అంతరించి పోయాయి. సెల్ టవర్లను పాఠశాల భవనాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు అవి కూలితే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. పట్టణాలు, గ్రామాల్లో నివాస గృహాల మధ్య ఒకే టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడంతో అక్కడి అధిక రేడియేషన్ వెలువడుతోందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఉత్తర్వులు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పట్టణాల్లో అయితే టౌన్‌ప్లానింగ్ అధికారుల నివేదిక అనుగుణంగా అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ 183) ప్రకారం అనుమతులు లేనిదే ఎక్కడబడితే అక్కడ సెల్‌టవర్ ఏర్పాటు చేయడానికి వీల్లేదు. జిల్లాలో చాలా టవర్లకు అనుమతులు లేవని తెలుస్తోంది. స్థానిక అధికారులు కంపెనీ ప్రతినిధులతో చేతులు కలిపి విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఓ భవనంపై ఏర్పాటు చేసిన సెల్‌టవర్

ఆరోగ్యం దెబ్బతింటోంది



నగరంలో ఇష్టానుసారంగా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయడంతో వాటి రేడియేషన్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. నిబంధనలకు విరుద్ధంగా టవర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఒక్కో ఇంటి డాబాపై ఒకే టవర్‌కు పలు కంపెనీలకు చెందిన పరికరాలు ఏర్పాటు చేయడంతో రేడియేషన్ అధిక మొత్తంలో విడుదలవుతోంది. అధికారులు స్పందించి జనావాసాల నడుమ ఉన్న టవర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం, నెల్లూరు నగరం

నివాసాలను తొలగిస్తే వీధిన పడతాం



- గచ్చుకాలువ కాశీకాయల అగ్రహారం వాసుల వెల్లడి

నెల్లూరు(బారకాసు): మా నివాసాలను నగర పాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని, మాకు పరిష్కారం చూపించాలని గచ్చుకాలువ కాశీకాయల అగ్రహారం నివాసి రమణయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన తన ప్రాంత వాసులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. నగరంలోని పొగతోట, గచ్చుకాలువ కాశీకాయల అగ్రహారం ప్రాంతంలో తమ పూర్వీకుల కాలం నుంచి 40కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. తామంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారమని తెలిపారు. తాముంటున్న నివాసానికి సంబంధించి ఇంటి, కుళాయి పన్నులు, విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నామన్నారు. అయితే ప్రస్తుతం నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు తాము కాలువల పక్కన నివాసం ఉంటున్నామని ఇళ్లను తొలగించాలని అంటున్నారని తెలిపారు. తామంతా దినసరి కూలీలుగా పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తాము తల దాచుకునేందుకు ప్రస్తుతం ఉంటున్న ఇళ్లు తప్ప మరేది లేదన్నారు. ఈ విషయంలో తాము తలదాచుకునేందుకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ సమావేశంలో రమణమ్మ, మస్తాన్, మురళీరెడ్డి, ఆదెయ్య, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



హర్ ఘర్ తిరంగా యాత్ర

నెల్లూరు(బారకాసు): దేశభక్తి పరవశంతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, ప్రతి పౌరుడి చేతిలో మువ్వన్నెల జెండా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవం వేడుకల్లో భాగంగా పార్టీ సంతపేట మండల అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని సంతపేటలో ఉన్న ఆదర్శ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మంగళవారం హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ యాత్రను ఆదర్శ ప్రభుత్వ పాఠశాల నుంచి సంతపేట, ములుముడి బస్టాండ్, గుప్తాపార్కు, నారాయణరావుపేట ప్రాంతాల్లో జరిగింది. వందేమాతరం, భారత మాతాకీ జై అనే నినాదాలు చేశారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఏపీ బయోవర్సిటీ బోర్డు గుంటూరు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవ వైవిధ్యం పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ, చర్చ, షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ఈనెల 15న పోలీసు పేరెడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లును అందజేయనున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఫణికుమార్, ప్రసూన, రామారావు, హరిబాబులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టరు కృష్ణారెడ్డి, ఎన్జీసీ కోఆర్డినేటర్ బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

నెల్లూరు (టౌన్): నారాయణ మెడికల్ కళాశాలలో డెంటల్ ద్వితీయ సంవత్సర విద్యార్థి ఆత్మహత్య ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నరహరి, నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ర్యాగింగ్ మహమ్మారిని అంతం చేసేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయించొద్దు

- ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య

నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన ప్రమాణాలను నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో కఠినంగా అమలు చేస్తున్నామని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య అన్నారు. నగర వ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయ విక్రయాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై స్థానిక స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, రేబాల వారివీధి తదితర ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించి, ట్రేడ్ లైసెన్సులను పరిశీలించారు. వివిధ దుకాణాల నుంచి 200 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. వినియోగదారులు వస్తువులను తెచ్చుకునేందుకు తమ వెంట జౌళి, నార, గుడ్డ సంచులను మాత్రమే ఉంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాగ్రత, నైతికతలే విజయసోపానాలు

నెల్లూరు (టౌన్): విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను తెలుసుకుని విజయం సాధించేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలని ఇంటర్నేషనల్ మార్కెటింగ్ కార్పొరేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ ఏకాగ్రత, జ్ఞానం, నైతికతలే మన విజయానికి సోపానాలన్నారు. విశ్రాంత కామర్స్ అధ్యాపకులు కుసుమకుమారి, ఆర్ఐఓ శ్రీనివాసులు, కెరీర్ గైడెన్స్ ప్రమోటర్ మల్లిఖార్జున, ఎన్ఎస్ఎస్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు పెంచల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

'రంగడి'సన్నిధిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

నెల్లూరు (బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో మంగళవారం పవిత్రోత్సవములు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంకురార్పణ, పూజా కార్యక్రమంలో జిల్లా దేవదాయ అధికారి జె.శ్రీనివాసరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి సభ్యులు వేలూరు శ్రీనివాసులు యాదవ్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అవయవ దానంతో ప్రాణరక్షణ

- మెడికల్ కళాశాలలో అవగాహనా ర్యాలీ

నెల్లూరు(అర్బన్): ఒక్కరి అవయవ దానంతో పలువురి ప్రాణాలు కాపాడవచ్చని ప్రభుత్వ పెద్దాస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాళేషాబాష అన్నారు. ప్రపంచ అవయవ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దర్గామిట్టలోని మెడికల్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు – సింహపురి దేహ సమర్పణ సంస్థ భాగస్వామ్యంతో పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాల వద్ద జరిగిన సభలో డాక్టర్ కాళేషాబాష మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన సందర్భాల్లో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని సమాజం కోసం ఎంతోమంది అవయవదానం చేస్తున్నారన్నారు. ఒక్కరి అవయవదానంతో కనీసం ఐదారు మంది రోగులకు జీవితాన్ని ఇవ్వవచ్చన్నారు. ఇది ఒక పవిత్ర కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా.గోవిందు, సింహపురి దేహసమర్పణ సంస్థ జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, భారతి, పినాకిని ఆశ్రమ నిర్వాహకురాలు మంజుల, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాను పీకేశారు



నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ గది వద్ద కొన్నాళ్ల క్రితం సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. మార్చురీ ప్రదేశంలోకి ఎవరెవరు వచ్చిపోతుంటారో దీనిలో రికార్డు అవుతూ ఉంటుంది. అంతేకాక అక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా రికార్డు అవుతుంది. అయితే సీసీ కెమెరా ఏర్పాటు తమ కార్యకలాపాలకు అడ్డుగా ఉందని అనుకున్నారో ఏమో దుండగులు దానిని పెరికి గోడకు వేలాడదీశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికైనా గుర్తించి దానిని మళ్లీ ఏర్పాటు చేయాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



కాత్యాయని వత్రం నిర్వహిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస మహోత్సవాల్లో భాగంగా నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రెండవ మంగళవారం సకలశుభాలు కలగాలని కోరుతూ మహిళలు కాత్యాయని వ్రతం భక్తిశ్రద్ధలతో సామూహికంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, కార్యనిర్వహణాధికారి జె.వెంకటసుబ్బయ్య పాల్గొని పర్యవేక్షించారు.

రంగనాథుడిని దర్శించుకున్న రాజేష్‌శర్మ



ప్రొఫెసర్ రాజేష్‌శర్మను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామిని నేషనల్ బోర్డు ఫర్ మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ రీజినల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రాజేష్‌శర్మ గురువారం దర్శించుకున్నారు. ఆయనను జిల్లా దేవదాయ అధికారి జె.శ్రీనివాసరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు అందించారు.

నరసింహస్వామిని కూడా..

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నరసింహకొండపై గల శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం ప్రొఫెసర్ రాజేష్‌శర్మ (మినిస్టరీ ఆఫ్ ఎంఎస్ఎంఇ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా), అతని బృందం దర్శించుకుంది. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి విశేషపూజలు నిర్వహించి ఆలయ చరిత్రను వివరించి, స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఐకమత్యమే బలం



ఫొటో ఎగ్జిబిషన్‌కు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించింది. తొలి రోజు ఫొటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థులతోపాటు పలువురు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐకమత్యంమే భారతీయుల బలమని, అలాంటి భారతావనిని చూడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో అప్పడు భారతీయుల పడిన కష్టాలు, ప్రాణనష్టాలను స్మరించుకుంటూ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీకాంత్‌ప్రదీప్, ప్రిన్సిపాల్ గిరి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం వేకువజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరాతీశారు. మృతుడు ఎరుపురంగు షర్ట్, బులుగు రంగు జీన్స్ ధరించి ఉన్నాడని, వయసు 50 సంవత్సరాల్లోపు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలియజేశారు. కేసు దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని వివరించారు.

పీహెచ్‌పీ సేవలు అభినందనీయం

నెల్లూరు(అర్బన్): రెగ్యులర్‌గా సేవా కార్యక్రమాలు చేస్తున్న కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీహెచ్‌పీ) సేవలు అభినందనీయమని 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి గిరి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం స్థానిక బుజబుజనెల్లూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, ఎరేజర్స్, పెన్సిల్ బాక్సులతో పాటు బిస్కెట్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, నాయకులు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రమేష్, పాఠశాల హెచ్‌ఎం శివకామేశ్వరి, సాయి తదితరులు పాల్గొన్నారు.